క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో మౌలాలిస్వామి సరిగెత్తు



పీరును ఊరేగిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో మౌలాలి స్వామి పెద్ద సరిగెత్తు గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రజలు పీరుకు పూల సేరాలు, దట్టీలు సమర్పించారు. రెండు రోజుల పాటు జరుగుతున్న సరిగెత్తు పూజలతో గ్రామం బంధు మిత్రులతో కళకళలాడుతోంది. సర్పంచ్ నాయిని సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: మండ్లెం సచివాలయం–2 పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టు కోసం ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండ్లెం సచివాలయం–2 పరిధిలో ఓ వలంటీరు పోస్టు ఖాళీగా ఉందని, ఓసీ(జనరల్) రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీచేయనున్నట్లు తెలిపారు. పదోతరగతి పాసై 18 –35 ఏళ్లలోపు వారు ఆన్‌లైన్‌లో 5వతేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మిడుతూరు: మండలంలోని అలగనూరు గ్రామ సచివాయల పరిధిలో ఖాళీలీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 7న దరఖాస్తుల పరిశీలన , 8న మౌఖిక పరీక్ష, 9న వలంటీర్ల ఎంపిక, 10న శిక్షణ, 11న విధుల్లో చేరాల్సి ఉంటుందని వివరించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆత్మకూరు: నల్లకాల్వ గ్రామంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 6వ తేదీన ఉదయం కొత్తరామాపురం గ్రామంలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

మిడుతూరు: స్థానిక 1వ సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి గురువారం తెలిపారు.కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరై ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

లేబర్‌కోడ్ రద్దు చేయాలి

ఆత్మకూరు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలకు వత్తాసు పలుకుతూ కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రాంనాయక్ డిమాండ్ చేశారు. స్థానిక సుదర్శన వర్మ భవనంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, ఆటో, హమాలీ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తేవాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పట్టణ ఉపాధ్యక్షుడు షాజిద్, నాయకులు సురేంద్ర, రణధీర్ పాల్గొన్నారు.

లాభసాటిగా పండ్ల తోటల సాగు



లక్ష్మాపురంలో పండ్ల తోటలను పరిశీలిస్తున్న సురేంద్రకుమార్

పగిడ్యాల: పండ్ల తోటల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలోని పడమర ప్రాతకోట, లక్ష్మాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ మద్దిలేటి, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు గోకారమయ్య ఉరుసు



గోకారమయ్య దర్గా

మిడుతూరు: మండలంలోని కడుమూరు గ్రామంలో గోకారమయ్య స్వామి ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. 4వ తేదీ రాత్రి 9–30 గటంలకు గంధం, 5న సాయంత్రం కిస్తీ వేడుకలు ఉంటాయని చెప్పారు.

ముంచుకొస్తున్న ప్రమాదం

- పూడికతో నిండిన గుండ్లకమ్మ వాగు
- ఆక్రమణలతో కుంచించుకుపోయిన వైనం
- ఏటా ముంపునకు గురవుతున్న పట్టణంలోని పలు కాలనీలు
- స్పందించని అధికారులు



కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు (ఫైల్)



పూడికతో నిండి ఉన్న గుండ్లకమ్మ వాగు

ఆత్మకూరు: ప్రతి ఏటా వర్షాకాలం ఆత్మకూరు పట్టణంలోని పలు కాలనీలు ముంపుకు గురవుతన్నాయి. 20 ఏళ్లకు పైగా పట్టణ ప్రజలు వరదనీటి ప్రవాహంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం గుండ్లకమ్మ వాగు. ఈ వాగు పట్టణ శివారు నుంచి ప్రారంభమై దాదాపు 2 కిమీ దూరం పట్టణంలో ప్రవహిస్తూ భవనాసి నదిలో కలుస్తుంది. కొన్నేళ్లుగా గుండ్లకమ్మ వాగు పరిసర ప్రాంతాల్లోని వివిధ కాలనీల ప్రజలు ఈ వాగును ఆక్రమించారు. ఫలితంగా ఎంతో విశాలంగా ఉన్న ఈ వాగు ప్రస్తుతం కుంచించుకుపోయింది. ఫలితంగా ఈ వాగు తన స్వరూపాన్ని కోల్పోయింది.

వర్షం వస్తే ముంపు ప్రమాదమే

పట్టణంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిస్తే చాలు పలు కాలనీలు ముంపుకు గురికావాల్సిందే. పట్టణంలోని లక్ష్మీనగర్, రహమత్‌నగర్, ఎరకలపేట, సాయిబాబ నగర్, గరీబ్‌నగర్ తదితర కాలనీలు జలమయం అవుతున్నాయి.శరా మాములే అన్నట్లుగా మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.అప్పుడప్పుడు పూడిక తీస్తున్నా నామమాత్రంగా చెత్త తొలగించడంతో మళ్లీ నిండుకుంటుంది. దీంతో వర్షం కురిసినప్పుడల్లా యథావిధిగా కాలనీలు జయమయమవుతున్నాయి.

వాగుకు అడ్డంగా కట్టడాలు

గుండ్లకమ్మ వాగు గతంలో ఎంతో విశాలంగా ఉండేది. ప్రస్తుతం ఈ వాగు వెంట ఉన్న కాలనీ ప్రజలు వాగును సైతం ఆక్రమించుకోవడంతో వాగు ఇరుకుగా మారింది. కొన్ని చోట్ల వాగుకు అడ్డంగా కట్టడాలు ఉండడంతో పాటూ వాగు పూర్తిగా పూడికతో నిండి ఉంది. ఫలితంగా ఒక మోస్తరు వర్షం కురిస్తే నీరంతా పలు కాలనీల్లో ప్రజల ఇళ్లలోకి, ప్రధాన రహదారుల వెంట ప్రవహిస్తుంది. వాస్తవానికి వర్షాకాలంలో నల్లమల అటవీప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురవడం సాధారణం. ఈ కాలంలో ఎప్పుడు భారీ వర్షం కురుస్తుందో, వాగులు పొంగి ప్రవహిస్తాయే తెలియని పరిస్థితి. ఊహించని విధంగా భారీ వర్షాలకు రెండేళ్లక్రితం గుండ్లకమ్మ పొంగి ప్రవహించడంతో దాదాపు 10 కాలనీలు జలమయం కావడమే కాకుండా కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి సైతం ముంపుకు గురైంది. ప్రతి రోజు ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్‌యార్డ్ తదితర ప్రాంతాలు సైతం నడుము లోతు వరద నీటితో నిండాయి.

విస్తరణే మార్గం

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తుంది. మరో రెండు నెలలు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాగా వాగులో అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. అయితే ఈ పనులు రెండు నెలలు క్రితం జరగడం వలన వాగులో యథావిధిగా పూడికచేరింది. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి వాగులో మళ్లీ నీరు నిలిచాయి. ముంపును నివారించడానికి పూడిక ఎప్పటికప్పుడు తీయడంతోపాటు వాగు విస్తరణ చేపట్టడమే మార్గమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

మరోమారు పూడికతీత పనులు చేపట్టాలి



గుండ్లకమ్మవాగులో మరోసారి పూడికతీత పనులు చేపట్టాలి. పూడికతీయకపోతే ప్రతి ఏడాది లాగే, ఈ సారి కూడా గరీబ్‌నగర్ కాలనీ ముంపునకు గురవుతుంది. ఈ సమయంలో ఇళ్లలోని నిత్యవసర సరుకులతో పా టూ అన్ని వస్తువులు నీటిలో మునిగి వేల రూపాయలు నష్టపోతున్నాం. అధికారులు పూడిక తీసి ప్రజలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– రబ్బాని, ఆత్మకూరు

వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి



వర్షాకాలం రెండు నెలలు ఉండడం వలన భారీ వర్షాలు కురిసే లోపుగా గుండ్లకమ్మవాగులో పూడికతీత పనులు చేపట్టి వరద నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఈ ఏడాది కూడా వరద ముంపునకుగురి కావాల్సిందే.

– శివన్న, ఆత్మకూరు

అవసరమైతే మరో మారు పూడిక తొలగిస్తాం

వర్షాకాలానికి ముందుగా పూడికతీత పనులు చేపట్టాం. మళ్లీ గుండ్లకమ్మలో పూడిక చేరి ఉండవచ్చు. అవసరమైతే మరోమారు తొలగిస్తాం. అధికవర్షాలు కురిసినప్పుడు గుండ్లకమ్మ వాగు నీరు కాలనీలకు చేరకుండా పూడికతీసేందుకు ప్రయత్నిస్తాం. పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేయం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

పంట నమోదు చేయించుకోండి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలను రైతుభరోసా కేంద్రాలను ఆశ్రయించి వెంటనే ఈ–క్రాప్ బుకింగ్‌తో పాటు పంటల బీమా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 10,022 హెక్టార్లు కాగా అందులో ఇప్పటి వరకు 60శాతం మేర మిరప, కంది, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగుచేశారన్నారు. మిగిలిన రైతులు ఇప్పుడిప్పుడే పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. కేసీ కాల్వకు సాగునీరు విడుదలైతే వరి పంట అధికంగా సాగు చేసే అవకాశాలున్నాయన్నారు. పంటలు సాగు చేసిన రైతులు వెంటనే ఈ క్రాప్‌బుకింగ్‌తో పాటు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సమయపాలన పాటించాలి

కొత్తపల్లి: మండలంలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం మండలంలోని కొత్తపల్లి, నందికుంట గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ సర్వేలన్నింటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆర్టీసీ బస్సు నడపాలి

నందికొట్కూరు: మల్యాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట విద్యార్థులతో కలసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయాణ ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలన్నారు. ఆర్టీసీ కంట్రోలర్ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు.

వేల్పనూరు హైస్కూల్‌లో విచారణ



మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

వెలుగోడు: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి వేల్పనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విచారణ చేపట్టారు. 2022లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పురుషోత్తం పాఠశాల హెచ్‌ఎం లింగన్నను దుర్భాషలాడటంతో అప్పట్లో హెచ్‌ఎం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.వెంటనే అతన్ని సస్పెండ్ చేసి హోళగుంద హైస్కూల్‌కు బదిలీ చేశారు. ఈ అంశంపై విచారణ చేసేందుకు డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి స్కూల్‌కు వచ్చి విచారణ చేపట్టారు. అనంతరం వెలుగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, గ్రామ సచివాలయాల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంపీడీఓ షేక్ అమానుల్లా ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అవసరమైన అల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బందికి గురువారం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఎంపీడీఓ గోపీకృష్ణ, డాక్టర్ నాగలక్ష్మి దేవి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా పిల్లలకు ఈ మాత్రలు మింగించాలని సూచించారు. ఎంఈఓ బాలాజీనాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఆరోగ్య పర్యవేక్షకులు గుర్రప్ప, ఆనందమ్మ, ఝూన్సీ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్ పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారంతో మహిళలు రక్తహీనతను అధిగమించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీఆర్వో శివన్న, శివరాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నందికొట్కూరు: బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పౌష్టికాహారం ఎంతో బలమని 13వ వార్డు కౌన్సిలర్ శాంతకుమారి అన్నారు. గురువారం వార్డులోని 28వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను అందజేశారు.

స్థాయిని తెలుసుకొని విమర్శించాలి



మాండ్ర అక్రమాలపై పేపర్ క్లిప్పింగ్‌లను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: విమర్శించే ముందు స్థాయిని తెలుసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మండ్లెం రమణ సూచించారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్యపై మండిపడ్డారు. మాండ్ర అడుగులకు మడుగులు వత్తే మీరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. లబ్బి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మీ నాయకులు ఎక్కడా ఉన్నారో తెలుసుకొని మాట్లాడాలని చెప్పారు. హైదరాబాద్ పోలీసు గ్రేహౌండ్స్ భూములను 143 ఎకరాలను కబ్జా చేసింది మాండ్ర కాదా అన్ని ప్రశ్నించారు. నయాంతో చేతులు కలిపి అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాండ్ర చరిత్రపై గతంలో పేపర్లలో వచ్చిన క్లిప్పింగ్‌లను చూపారు. గతంలో మీ చరిత్ర మొత్తం మీడియా బట్టబయలు చేసిందని చెప్పారు. లబ్బి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 98 జీఓ కింద నియోజకవర్గంలో 1,650 మందికి ఉద్యోగాలు ఇప్పించారని గుర్తు చేశారు. నాయకులు భాస్కర్, దౌలత్‌బాషా, సురేష్, రమేష్, డాక్టర్ సుధాకర్, సంజన్న, ఈశ్వరుడు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జనార్దన్ శెట్టి

మహానంది: ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై గురువారం మహానందిలోని కార్యాలయంలో సమావేశంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి పేర్లు తప్పులుంటే, అడ్రస్ మార్పులు, చేర్పులు తదితర అంశాలపై పరిశీలించి సర్వేలో పొందుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

నందికొట్కూరు: మణిపూర్‌లో మహిళల పట్ల సమాజం తలదించుకునేలా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రం మూడు నెలల నుంచి తగలబడుతుంటే బీజేపీ ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. మణిపూర్ రాష్ట్రం అగ్నిగుండంగా మారడానికి కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్నారు. నాయకులు అరుణ్, శంకర్, జునైద్ బాషా, రఫి, గోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా



సంతజూటూరులో పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అజెండాగా పరిపాలన సాగిస్తున్నారని, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పర్యటించిన అనంతరం మండలంలో కార్యక్రమం ముగియడంతో నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి సొసైటీ కార్యాలయం వద్ద కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అందరి సహకారంతో మండలంలో కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అంతక ముందు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, సమస్యలకు పరిషారం చూపారు. గ్రామంలో మల్లలమ్మ గుడి నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని, విద్యుత్ సమస్యలు తీర్చాలని అధికారులను ఆదేశించారు. పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ కాకనూరు సుబ్బయ్యయాదవ్, నాయకులు భూమా రఘునాథరెడ్డి, కొంగీస శివశంకర్, దూదేకుల మౌలాలి, శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, బాబురెడ్డి, సీఈఓ గోపాల్, లింగాపురం నాయకులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని గొర్రెలు మృతి



బ్రాహ్మణకొట్కూరులో మృతి చెందిన జీవాలు

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో విషపు గుళికలు తిని 10 గొర్రెలు, మేకలు మృతి చెందాయని బాధితులు నారాయణ, రామకృష్ణ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని పచ్చిక బయలు ప్రాంతంలో ప్రమాదవశాత్తు విషపుగుళికలు తిని చనిపోయాయని దీని వల్ల తమకు రూ.లక్షకు పైగా నష్టంవాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం పశు బీమా పథకం కింద ఆదుకోవాలని కోరారు.

చేతిపంపునకు మరమ్మతులు

వెలుగోడు: పట్టణ శివారులో నిరుపయోగంగా ఉన్న చేతి పంపునకు పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వేల్పనూరు రస్తాలోని వెంగళరెడ్డి నగర్‌లో చేతిపంపు పని చేయకుండా పోయింది. స్థానికులు విషయాన్ని సర్పంచ్ జయపాల్ దష్టికి తీసుకెళ్లడంతో గురువారం సిబ్బందితో మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెచ్చారు.

జగనన్న ప్రభుత్వంలో కౌలు రైతులకు న్యాయం

ఆత్మకూరు:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కౌలు రైతులకు న్యాయం జరుగుతుందని రైతు సంఘం అధ్యక్షుడు భైరాపురం షేక్‌మహబూబ్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని రైతు, కౌలు రైతుల సంఘం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులు దరఖాస్తులు చేసుకున్న వెంటనే కౌలు కార్డులు అందజేసి సంక్షేమ పథకాలు వర్తంపజేసి అండగా నిలుస్తుందని చెప్పారు.మొమిన్ మునీర్‌బాషా, షేక్‌మహబూబ్‌బాషబూ,ఇబ్రహీం, కలీముల్లా పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగల అభివృద్ధి

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణతో మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు ప్రేమరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోతే మాదిగలు, 59 ఉపకులాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రిజర్వేషన్లు ఉండడంతో ఒకే సామాజిక వర్గం లబ్ధి పొందుతుందని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు వర్గీకరణ రద్దు చేయలేదని ఆర్డినెన్స్ ద్వారా కాకుండా చట్ట సభల ద్వారా ఆమోదం పొందాలని చెప్పిందన్నారు. నాయకులు శ్రీను, స్వాములు, రాజేష్, వెంకటేశ్వర్లు, శేషన్న, ఏసన్న, రాము, నాగేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుడి సన్నిధిలో..



శ్రీకాళహస్తిలో మహానంది ఈఓ, చైర్మన్

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో నూతనంగా చేపట్టనున్న ఇత్తడి గ్రిల్స్ అభివృద్ధి పనుల్లో భాగంగా పరిశీలించేందుకు కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి గురువారం శ్రీకాళహస్తి వెళ్లారు. వారికి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఏటీ శ్రీనివాసులు, ఏఈఓ మల్లికార్జున ప్రసాద్ స్వాగతం పలికారు. పూజల అనంతరం అక్కడి అభివృద్ధి పనులు పరిశీలించి పలు ప్రణాళికలు తీసుకున్నారు. వారి వెంట వేదపండితులు రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో దాతలు

మహానంది: తిమ్మాపురం జిల్లా పరిషత్, కస్తూర్బా పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు తిమ్మాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ పెద్ది మహానందిరెడ్డి, తిమ్మాపురం దేవస్థానం మాజీ చైర్మన్ పెద్ది శివరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి గురువారం నగదు బహుమతులు అందించారు. 2022–23 ఏడాదిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సౌమ్య, రేణుక, నవ్యను అభినందించారు.జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం నారాయణ, ఎస్పీఓ హర్షిత పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



పైపులైన్ నిర్మాణానికి జేసీబీతో కాలువ తీయిస్తున్న దృశ్యం

పాములపాడు: గ్రామంలో తాగు నీటికు పరిష్కారం చూపుతామని సర్పంచు వరప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామం దేవనగర్ కాలనీలో నూతన పైపు లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అలాగే నూతన బోరు మోటారును అమర్చారు. మజరా గ్రామం క్రిష్ణారావు పేట ముస్లిం కాలనీలో నూతన పైపు లైన్ నిర్మాణానికి జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. త్వరితగతిన పైపు లైన్ నిర్మాణం పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. నాయకులు రామలింగేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జుబేర్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య ఉన్నారు.

నాటుకు సిద్ధమవుతున్న రైతన్న



తరిగోపుల మొలక దశలో వరి నారు



80బన్నూరు వద్ద పచ్చగా నారు

జూపాడుబంగ్లా: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల కేసీ కాల్వకు త్వరగా సాగునీరొచ్చే అవకాశాలున్నందున ఆయకట్టు రైతులు వరి నారును సిద్ధం చేసుకుంటున్నారు. కాల్వకు నీళ్లొచ్చిన వెంటనే నాట్లు వేసుకొనేందుకు వరి నారు కోసం వేచిచూడకుండా వెంటనే నాట్లు వేసుకునేలా ఇప్పటికే నారు పోసుకున్నారు. కర్నూలు నుంచి లాకిన్సలా వరకు 120 కి.మీ. మేర విస్తరించి ఉన్న కేసీ కాల్వ కింద 65వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కేసీ కాల్వ కింద 32వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసే అవకాశాలున్నాయని కేసీ కాల్వ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని భాస్కరాపురం, తాటిపాడు, 80బన్నూరు, తరిగోపుల, తూడిచెర్ల, పోతులపాడు తదితర గ్రామాల్లో 6వేల ఎకరాల మేర వరి పంట సాగుచేస్తారని అధికారులు చెబుతున్నారు. కొందరు ఇప్పటికే నారు పోసుకోగా, మరికొందరు ఇప్పుడిప్పుడే వడ్లు చల్లుకుంటున్నారు.